ప్రజాశక్తి
గురువారం 21 నవంబరు 2024
5
శ్రీకాకుళం



## నేడు రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - టెక్కలి

డిసెంబరు 1, 2 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు పుట్టిన తేదీ, తదితర ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 8500007272, 7842423423 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అసంతృప్తి సెగలు

- ఐదు విడతలుగా జిల్లాకు పలురకాల నామినేటెట్ పోస్టులు
- ప్రాధాన్యం లేని పోస్టులంటూ కొందరు అలక
- నామినేటెడ్ పదవులు దక్కక నిరాశలో కొంతమంది నాయకులు
- డిసిసిబి, డిసిఎంఎస్ వంటి పోస్టుల భర్తీపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు

**ప్రభుత్వం ఐదు విడతల్లో అనేక నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. కూటమి నాయకులకు పలురకాల కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను కట్టబెట్టింది. పదవులను దక్కించుకున్న వారు తమ స్థాయికి తగ్గది కాదంటూ కొందరు అలకబూనుతున్నారు. తమకు ప్రాధాన్యం లేని పోస్టులు ఇచ్చారనో, ఒక సామాజిక కార్పొరేషన్‌కు పరిమితం చేశారో అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పుట్టినప్పట్నుంచి కష్టపడి పనిచేస్తున్న తమను పార్టీ గుర్తించలేదంటూ టిడిపి, జనసేన నాయకులు అంతర్గతంగా కోపంతో రగిలిపోతున్నారు. కొందరు మాత్రం ఇంకా ఆశలు వదులుకోవడం లేదు. జిల్లాకు సంబంధించి ఖాళీగా ఉన్న డిసిసిబి, డిసిఎంఎస్, మార్కెట్ కమిటీ పోస్టుల్లోనైనా స్థానం దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి




వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో టిడిపి కేడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో మొదటి, రెండు పర్యాయాల్లో టెక్కలి నియోజకవర్గానికి చోటు దక్కలేదు. మూడో విడతలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బగాది శేషగిరిరావుకు అవకాశం కల్పించింది. నియోజకవర్గంలో గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్న కళింగులకు రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం ఉన్న పదవి ఇవ్వలేదంటూ కొత్తగా నియమితులైన శేషగిరిరావు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలిసింది. తమ సామాజిక తరగతిని అణచివేసేందుకు ఒక పద్ధతి ప్రకారం కొంతమంది వ్యవహరిస్తున్నారని ఆయన తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. డైరెక్టర్ పదవితో పాటు పార్టీని వీడుతారనే చర్చ సాగుతోంది. మరోవైపు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సుమారు పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన కణితి కిరణ్‌ను ఆ పార్టీ అధిష్టానం కనీసం పట్టించుకోకపోవడంపై నియోజకవర్గ జన సైనికులు మండిపడుతున్నారు.

### అసంతృప్తిలో జన సైనికులు

జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పలు సంఘాలకు రాష్ట్రస్థాయి హోదాలో పనిచేశారు. మరోవైపు జిల్లా అధ్యక్షుని గానూ పార్టీ బాధ్యతలను చూస్తున్నారు. ఆయనకు తూర్పుకాపు సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఒక సామాజిక తరగతికి మాత్రమే తనను పరిమితం చేసేలా పదవి అప్పగించడంపై అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జీల మాదిరిగానే తనకూ డైరెక్టర్ పదవే ఇవ్వడంతో కొంత మనస్తాపానికి గురయ్యారు. పదవిని సున్నితంగా తిరస్కరించాలని భావిస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఇచ్ఛాపురం జనసేనలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న దాసరి రాజుకు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై పార్టీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి గానీ కనీసం జిల్లాస్థాయి హోదా ఉన్న పదవి ఇస్తారని ఆశిస్తే, ఒక సామాజిక తరగతికి పరిమితం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కవిటికి చెందిన లోళ్ల రాజేష్‌కు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై జన సైనికులు భగ్గుమంటున్నారు. పాతపట్నం నియోజకవర్గానికి చెందిన కొరికాన రవికుమార్ ఐదేళ్ల కిందట పార్టీలో చేరి పెద్దగా పనిచేసిందేమీ లేకపోయినా సుడా చైర్మన్ పదవి కట్టబెట్టి తనను నిర్లక్ష్యం చేయడంపై రాజు కినుక వహించినట్లు సమాచారం. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### ఇతర నియోజకవర్గాల్లోనూ అసంతృప్తి జ్వాలలు



నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో ఇతర నియోజకవర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న పరిస్థితి ఉంది. ఎచ్చెర్ల నియోజకవర్గ కోటాలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన చౌదరి నారాయణమూర్తి, అన్నెపు భువనేశ్వర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా టిడిపి అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు తన సతీమణి ధనలక్ష్మి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేశారని, అటువంటి తమ కుటుంబానికి కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టును కట్టబెట్టడాన్ని ఆయన అనుచరులు తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. ఒక హోదాలో పనిచేసి గుర్తింపు తెచ్చుకున్న తనకు, ఒక సామాజిక తరగతికి పరిమితమయ్యే కార్పొరేషన్‌కు డైరెక్టర్ పోస్టు ఇవ్వడంపై కినుక వహించినట్లు తెలిసింది. పలాస నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జి దుర్గారావు కూడా అదే రకమైన భావాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రస్థాయి హోదా ఉన్న ఏదైనా చైర్మన్ పదవి ఇస్తారని భావిస్తే, రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు.

### ఆశలు వదలుకోని ఆశావహులు

ఐదు విడతల్లో ప్రకటించిన పోస్టుల్లో తమకు ఏ నామినేటెడ్ పదవీ దక్కకపోవడంపై కూటమి నాయకులు ముఖ్యంగా టిడిపి నేతలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని అంటిపెట్టుకుని కష్టపడి పనిచేస్తున్న జామి భీమశంకరరావుకు చోటు కల్పించకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సుడా చైర్మన్ పదవిపై ఆయనకు భరోసానిచ్చినా పని మాత్రం జరగలేదు. జనసేన కోటాలో పాతపట్నం నియోజకవర్గానికి చెందిన కొరికాన రవికుమార్ ఆ పదవిని దక్కించుకున్నారు. పార్టీ అధిష్టానం ఇప్పుడు భీమశంకరరావుకు ఏవిధంగా న్యాయం చేస్తుందోనని కార్యకర్తలు అనుకుంటున్నారు. మరోవైపు కొంతమంది ముఖ్య నాయకులు తమకు కార్పొరేషన్ల పదవుల్లో స్థానం దక్కకపోయినా డిసిసిబి, డిసిఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ల పదవులు వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



ధర్నా చేస్తున్న విఒఎలు

# విఒఎల జీవితాలతో చెలగాటం

- కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి
- నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలి
- కలెక్టరేట్ వద్ద విఒఎల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగు విఒఎలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన విఒఎలు ఆర్‌అండ్‌బి బంగ్లా రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలుగు శాఖలో పనిచేస్తున్న డ్వాక్రా విఒఎలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను గత ప్రభుత్వం 2019లో తెచ్చిందన్నారు. దీనివల్ల 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్న విఒఎల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గత ప్రభుత్వానికి అనేకసార్లు విన్నపాలు, నిరసనలు, పోరాటాల ఫలితంగా ఈ సర్క్యులర్ అమలు నిలుపుదల చేసిందన్నారు. ఎన్నికల ముందు టిడిపి నాయకులు విఒఎల పోరాట శిబిరంలో అధికారంలోకి వస్తే ఈ సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కానీ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ సర్క్యులర్ ఆధారంగా మూడేళ్లు పూర్తయిన విఒఎలను మార్చుకోవచ్చని ప్రకటన చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల విఒఎలను తొలగిస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ సర్క్యులర్‌ను రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమంగా తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా గౌరవ వేతనం అందకపోవడంతో విఒఎలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌ల భారంతో వారని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రకరకాల సర్వేలు రాత్రీ పగలు అనకుండా అప్‌లోడ్ చేయాలని చెప్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. మహిళా మార్టుల్లో సరుకుల బలవంతపు కొనుగోళ్లకు విఒఎలకు లక్ష్యాలు నిర్దేశించడం ఆపాలన్నారు. అనంతరం కలెక్టర్ స్వప్నికల్ దినకర్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాలో వెలుగు విఒఎల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు, డి.జోగారావు, జయలక్ష్మి, వై.అనురాధ, వై.హేమలత, ఎం.శోభారాణి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలకు పాఠశాల తొలి మెట్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి పాఠశాల తొలి మెట్టు అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని బొందిలీపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ శ్రద్ధాసక్తులతో చదవాలని సూచించారు. చదువుతోనే సమాజ మార్పు సాధ్యమన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరవచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి బాధ్యతాయుతంగా విద్యను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు



స్విమ్మర్స్‌ను అభినందిస్తున్న ఎస్‌జిఎఫ్ ప్రతినిధులు

## జాతీయ స్విమ్మింగ్ పోటీలకు జిల్లా స్విమ్మర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న 68వ జాతీయ స్విమ్మింగ్ పోటీలకు జిల్లా నుంచి డి.సాయిగీతిక, బి.స్పందన ఎంపికయ్యారు. నగరంలోని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో వీరిని ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సాంబశివరావు, బి.వి రమణ, స్విమ్మింగ్ కోచ్ షేక్ సుభాన్ బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన డి.సాయి గీతిక... సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించిన స్పందన జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటాలని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ ఉపాధ్యక్షులు ఎం.వి రమణ, సిమ్మింగ్ అసిస్టెంట్ కోచ్ ఆర్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విధానాల్లో ఆదర్శం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వ్యవసాయ విధానాల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి అన్నారు. వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ, ఎపిసిఎన్‌ఎఫ్ ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాలు తొలి విడత ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. రసాయనిక వ్యవసాయ పద్ధతులను దూరం చేస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించే విధంగా ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల పని విధానాన్ని బలోపేతం చేయడానికి శిక్షణా తరగతులు ఉపకరిస్తాయన్నారు. శిక్షణ బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగానే నాలుగు రోజులు తరగతి శిక్షణ, ఒక రోజు ఫీల్డ్ శిక్షణలో భాగంగా జీవామృతాలు, విత్తన గుళికలు, కషాయాల తయారీ విధానాలను క్షేత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి రెండో విడత శిక్షణా కార్యక్రమంలో రెండు బృందాలుగా వంద మంది జిల్లా ప్రకృతి వ్యవసాయ క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఎచ్చెర్లలోని డిటిడిసిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం నుంచి శ్రీరామ్ కుమార్ శిక్షణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



## బాలల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక మహిళా కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు బాలబాలికలతో నిర్వహించిన ర్యాలీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రమణ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లాస్థాయిలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేకించి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చట్టబద్ధమైన పిల్లల దత్తతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 18 ఏళ్ల వరకు పిల్లలను దత్తత ఇస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఉన్న వారే కాకుండా ఇతర దేశస్థులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవచ్చని తెలిపారు. డిఎస్‌పి సిహెచ్.వివేకానంద మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టరాదని స్పష్టం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వికలాంగ శాఖ ఎడి కవిత తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీని ప్రారంభిస్తున్న ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ

# గంజాయి నియంత్రణకు నిరంతర తనిఖీలు

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు సరిహద్దు చెక్‌పోస్టు, రహదారి మార్గంలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. స్టేషన్ ప్రాంగణం, లోపల గదులు, ప్రాపర్టీ, లాకప్ గదులను పరిశీలించారు. ముఖ్యమైన రికార్డులు, కేసు ఫైళ్లను తనిఖీ చేసి ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ఆయా కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ స్పాట్స్‌కు ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తరుచూ సంభవించడానికి గల కారణాలను అన్వేషించి, స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ మోసాలపై నమోదైన కేసుల నమోదు తదనంతరం చేపట్టిన చర్యలపై ఆరా తీసి నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన నగదును తిరిగి బాధితులకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలు, యువతకు వివరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని పురుషోత్తపురం చెక్‌పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల తనిఖీలు సరళి, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డిఎస్‌పి అప్పారావు, ఇచ్ఛాపురం సిఐ చిన్నంనాయుడు, ఎస్‌ఐ చిన్నంనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

# విద్యుత్ కార్మికుల 'రాయబారం'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పీస్ రేటు కార్మికుల సమస్యలపై ఈనెల 22న నిర్వహించనున్న హెచ్.ఆర్ సమావేశంలో చర్చించి పరిష్కరించాలని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త రాయబారం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ ఇఇ జి.సురేష్‌బాబుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు బుధశారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర డిస్కమ్‌ల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టి ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐటిఐ విద్యార్హత ఉన్న వాచ్‌మెన్‌లను షిఫ్ట్ ఆపరేటర్లుగా అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటికే షిఫ్ట్ ఆపరేటర్ ప్రమోషన్ పొందిన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికుల్లో ఐటిఐ విద్యార్హత ఉన్న వారిని స్కిల్డ్ వర్కర్లుగా నియమించి పాత వారితో సమానమైన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి 2018 తరహాలో ఇన్సెంటివ్ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఇన్‌సెంటివ్ నిర్ణయించాలని కోరారు. ఆరు నెలలకోసారి విడిఎ ఇవ్వాలని, కొత్త సర్కిల్ కార్యాలయాల పరిధిలో కార్మికుల అనుమతితోనే బదిలీలు చేపట్టాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి కార్మికులపై పని భారాన్ని తగ్గించాలన్నారు. కార్మికులకు హెల్త్ కార్డులు ఇచ్చి షరతుల్లేని ఉచిత వైద్యం అందించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్ కార్మికులైన మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్‌పిఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. నైట్ వాచ్‌మెన్లుగా సబ్ స్టేషన్లలో నియమించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.రమణ, కె.వెంకటసూర్యం, జి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

## ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదు

**జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. అన్ని రంగాల్లో వికలాంగులు రాణించాలన్నారు. డిసెంబరు 3వ తేదీన ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నగరంలోని డచ్ భవనం వద్ద జిల్లాస్థాయి వికలాంగుల ఆటల పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు ఏ రంగంలోనూ ఎవరితోనూ తీసిపోరని చెప్పారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అందుకోవాలనే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిభావంతులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. తెలివితేటలకు తోడు రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. దీనిపై అందరూ చైతన్యవంతులు కావాలన్నారు. వికలాంగుల శాఖ ఎడి కవిత మాట్లాడుతూ ఆటల పోటీల్లో విజేతలకు డిసెంబరు మూడో తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. 6 నుంచి 15 ఏళ్ల బాలబాలికలకు 15 ఏళ్లు పైబడిన సహాయకులతో నడక, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, చెస్, పాటల పోటీలు, కేరమ్స్, క్రికెట్, జావెలెన్ త్రో, ట్రై సైకిళ్లు, తదితర ఆటలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డిఎ కె.సాయి ప్రత్యూష, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు కిరణ్ కుమార్, సుధాకర్, సిపిఒ లక్ష్మీప్రసన్న, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, బాలల హక్కుల సంరక్షణ అధికారి రమణ, నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

## ఆ పనులు నిలుపుదల!

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎచ్చెర్ల మండలంలోని మండల పరిషత్ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.99 లక్షలతో చేపట్టే పనులు నిలుపుదల చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు తెలిపినట్లు సమాచారం. 'రోడ్డు పనుల రూపంలో నిధులు స్వాహా' శీర్షికన ప్రజాశక్తిలో ఈనెల 20న ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి ఎంపిడిఒ హరిహరరావు, పంచాయతీరాజ్ ఇఇ ఎస్.రామకృష్ణ, ఎఇడి సూర్యచంద్రను పిలిచి పనుల వివరాలపై ఆరా తీసినట్లు తెలిసింది. రూ.ఐదు లక్షల్లోపు పనులు విభజన చేయకూడదని, వాటిని నిలుపుదల చేస్తామని చెప్పారు. మండల పరిషత్ అధికారులు పనులు చేసినట్లు చేపడితే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించినట్లు తెలిసింది. ప్రస్తుతం చేపట్టిన మూడు పనుల బిల్లు నిలుపుదల చేస్తామని మండలస్థాయి అదికారులు తెలిపారు. నిబంధనలు ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించినట్లు సమాచారం.

## సుమిత్రమ్మ మృతి తీరని లోటు

**శ్రీకాకుళం:** తెలుగు రచయితల వేదిక (తెరవే) సభ్యురాలు, విశ్రాంత తెలుగు పండిట్ అయ్యగారి సుమిత్రమ్మ మృతి సాహిత్యానికి తీరని లోటు అని తెరవే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వందలాది సంప్రదాయ కవితలను రాసి ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. సాహిత్యంలో సముచిత పాత్రను పోషిస్తున్న విమర్శనా ప్రక్రియలోనూ అందెవేసిన చేయిగా ప్రశస్తికెక్కారని పేర్కొన్నారు. వృద్ధాప్యాన్ని లెక్క చేయకుండా తుదిశ్వాస విడిచేవరకు కవితా వ్యాసంగాన్ని నిర్వహించిన కవయిత్రిగా సాహిత్యంలో తనదంటూ ఓ ముద్ర వేసిన సుమిత్రమ్మ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 'ఎన్‌టిఆర్ సుజలధార' సంజీవని

### అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న శిరీష

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలాసలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ సుజలధార పథకం కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో ఓ సంజీవనిలా పనిచేసిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం నిర్వహించిన అసెంబ్లీలో మరోమారు కిడ్నీ మహమ్మారిని అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో కిడ్నీ వ్యాధులు ప్రబలి ఉన్నాయని తెలిపారు. 2014లో చంద్రబాబు కిడ్నీ ప్రభావిత గ్రామాలకు శుద్ధజలాన్ని అందించేందుకు ఎన్‌టిఆర్ సుజలధార పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అయితే నియోజకవర్గంలో 135 యూనిట్లకు గాను ఐదేళ్లుగా గత ప్రభుత్వం ఈ పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం 54 మాత్రమే పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉపసభాపతి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న యూనిట్లకు మరమ్మతులు చేపట్టి, లేనిచోట కొత్త యూనిట్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కోరారు.

## తిరుమలరావు కవితకు ప్రశంసలు

ప్రజాశక్తి- కొత్తూరు


తిరుమలరావు

ఢిల్లీలోని ఐన కళా వేదిక నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీల్లో పాతపొన్నుటూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుదమ తిరుమలరావు విజేతగా నిలిచారు. అంతర్జాతీయ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్‌కుమార్ నేతృత్వంలో ఢిల్లీ కేంద్రంగా అంతర్జాలం ద్వారా 'బాల్యం' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో 'బొమ్మరిల్లు' అనే కవితను తిరుమలరావు పంపించారు. 32 ప్రపంచ రికార్డులను సాధించిన ఏకైక సంస్థ జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీభూషణం, జాతీయ కో-ఆర్డినేటర్ నూక సంపత్, జాతీయ సోషల్ మీడియా ప్రతినిధి నల్లా భాగ్యలక్ష్మి తదితరులు తిరుమలరావును అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని పంపారు. విజేతగా ఎంపికపై రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు


ఎచ్చెర్ల : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎచ్చెర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. సందర్భంగా మాట్లాడుతూ రైతులకు, కార్మికులకు, ప్రజలకు పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని టిడిపి, జనసేన వ్యతిరేకించాయని గుర్తు చేశారు. అదానీ, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, ఎపి హమాలీస్ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవిందకుమార్, ఎల్.రాము, ఎన్.రమణ, ఎన్.సీతారాం, జె.చిట్టప్పడు పాల్గొన్నారు.


లావేరు : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**లావేరు :** ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్స్ బిగింపు ఆపాలని సిఐటియు నాయకులు ఎన్.వి.రమణ డిమాండ్ చేశారు. మండలంలతోని బుడుమూరు సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు ఎల్.నాగరాజు, ఎం.అశోక్, పి.శ్రీనివాసరావు, ఎం.సునీల్, ఎస్.శ్రీను, ఎన్.మోహన్, ఎం.రాము, పి.సూరిబాబు పాల్గొన్నారు.

## శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం శంఖరావంలో భాగంగా ధర్నా చేపడుతున్నామని సిఐటియు నాయకులు ఎన్.గణపతి తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు ప్రకారం రైతు గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటికరణ ఆపాలన్నారు. స్కీమ్ వర్కర్లకు ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ధరలను అదుపు చేయాలన్నారు. ప్రజా పంపిణీ పథకాన్ని బలోపేతం చేయాలన్నారు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టర్లను అందజేశారు. శంఖారావం ప్రచారంలో భాగంగా 22న బైక్ ర్యాలీ చేపడుతున్నట్టు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ, ధర్నాలో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు సిహెచ్.వేణుగోపాల్, రైతు కూలి సంఘం నాయకులు వి.మాధవరావు, ఎపి రైతు సంఘం నాయకులు కె.బాలాజీరావు, ఐఎఫ్‌టియు నాయకులు జె.వీరాస్వామి, కాంగ్రెస్, ప్రజా సంఘం నాయకులు బద్రి సీతమ్మ తదిలరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

## విజయగౌరిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకుందామని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తపల్లిలోని ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార పోస్టరును బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేధావుల సభకు సమస్యలపై అవగాహన కలిగి సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించ కలిగిన సామర్థ్యం ఉన్న అభ్యర్థులను పంపించాలన్నారు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా గతంలో ఎన్నికైన ఐ.వెంకటేశ్వరరావు, కె.ఎస్.లక్ష్మణరావు, విటపు బాలసుబ్రమణ్యము, చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వరరావు సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, యుటిఎఫ్ నాయకులు వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, బి.ఆనందరావు, ఎం.గోవిందరావు, రామారావు పాల్గొన్నారు.

# 'అపార్' సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- టెక్కలి


వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అపార్ నమోదు కార్యక్రమంపై రెవెన్యూ అధికారులు సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య, జిల్లా కార్యదర్శి బాలక శంకరావులు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన వివరాలతో కూడుకున్న అంశాలను సంబంధిత విఆర్‌ఒ, కార్యదర్శి చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత డాక్యుమెంట్లు అందించేందుకు నోటరీ చేయిస్తే విఆర్‌ఒల ద్వారా త్వరితగతిన నమోదుకు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పాఠశాల స్థాయిలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పడాల గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, కుప్పిలి కామేశ్వరరావు, పాలవలస ధర్మారావు, వై.గణపతిరావు, బి.అరుణకుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

## కెజిబివి సందర్శన

**సోంపేట :** మండలంలోని రాజాంలోని కెజిబివిని డిఇఒ తిరుమల చైతన్య బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారితో మాట్లాడి, పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. భోజనాల ఏర్పాటు, బోధన ఇతర అంశాలను గురించి ప్రశ్నించారు. అనంతరం పాఠశాలను, పరిసరాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఎస్ఒ కాంతమ్మ, సిబ్బంది ఉన్నారు.

## యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


దాసరి రాజు

ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలను బుధవారం అప్పగించారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి రాజు శ్రమించారు. దీంతో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సముచిత స్థానం ఇచ్చి గౌరవించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ విజయానికి తన వంతు కృషి చేశారు. డైరెక్టర్‌గా నియమించడంపై సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు రాజు కృతజ్ఞతలు తెలిపారు.


పళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ బాలకృష్ణ

## రోగులకు పళ్లు పంపిణీ

ప్రజాశక్తి- పలాస

సత్యసాయి బాబా జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పలాస ప్రభుత్వాస్పత్రి, సాయి శ్రీనివాస మల్టీ స్పెషల్ ఆస్పత్రి, శౌర్య, రాజరాజేశ్వరి, ఆక్సిజన్, శ్రీకృష్ణ, నీలమణి దుర్గ, సీతారామ నర్సింగ్ హోం, విష్ణు ప్రియా శివ దుర్గా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా ఆస్పత్రుల వైద్యులు టి.బాలకృష్ణ, సత్యసుభాష్, ఎం.మల్లేశ్వరరావు, ఎస్.హేమసుందర్, పొందల జగదీష్, బెందాళం కాళింది, కూన మోహన్‌బాబు, ఎం.మంజుల, రాజ్‌కుమార్, సత్యసాయి జిల్లా సాధన శిబిరం ఇన్‌ఛార్జి జామి చిరంజీవి శ్రీనివాస్, కన్వీనర్ జగదీష్, శ్రీనివాస్, కామేశ్వరరావు, శరత్, రాజేష్, కొండలరావు పాల్గొన్నారు.

## బెంతు ఒరియాలకు న్యాయం చేయాలి

### ఎమ్మెల్సీ రామారావు


మాట్లాడుతున్న రామారావు

**కవిటి:** ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాలల్లో ఉన్న 25 వేల మంది బెంతు ఒరియాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. బుధవారం శాసనమండలి బడ్జెట్ సమావేశాల్లో స్పెషల్ మెన్షన్ అవర్‌లో బెంతు ఒరియాల సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ఎస్‌టిలుగా గుర్తింపు పొందిన బెంతు ఒరియాలు ప్రస్తుతం సతమతమవుతున్నారని తెలిపారు.


జగదీష్‌ను సన్మానిస్తున్న యాదవులు

## జగదీష్‌కు సన్మానం

ప్రజాశక్తి- పలాస

ఎపి యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన ఇప్పిలి జగదీష్‌కు టెక్కలిలో ఆయన స్వగృహంలో జిల్లా యాదవ సంఘం నాయకులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. యాదవల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు లొడగల కామేశ్వరరావు, అంబటి కృష్ణమూర్తి, కిక్కిర ఢిల్లీరావు, సప్ప మన్మథరావు, కొరికాన శంకర్, దాసరి తాతారావు, వంకల కూర్మారావు, సప్ప నవీన్, బద్రి గోపాల్, ఎం.నాగయ్య, కె.బాలరాజు, కె.రాజు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న మేనేజర్ లక్ష్మణరావు

## బీమా సొమ్ము అందజేత

**పొందూరు:** మండలంలోని కింతలికి చెందిన సొండి పున్నారావు ఇటీవల మృతి చెందారు. అతని భార్య హేమలతకు బుధవారం పెనుబర్తి ఎస్‌బిఐ శాఖ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణరావు రూ.2 లక్షల చెక్కును అందజేశారు. మృతుడు ఎస్‌బిఐలో ఖాతాను కలిగి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో రూ.436 ప్రీమియం చెల్లిస్తుండడంతో ఈ బీమా మొత్తాన్ని నామినికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఐ మేనేజర్ భాస్కరరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

## కేసుల రాజీకి సహకరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

వచ్చే నెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు అందరూ సహకరించాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజచక్రవర్తి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజీకి అనుకూలమైన కేసులను పరిశీలించాలన్నారు. క్రిమినల్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పోలీస్‌లు, ఎక్సైజ్ పోలీస్‌లు, అధికారులు పాల్గొన్నారు.


దర్శించుకుంటున్న తిలక్

## 'రెయ్యమ్మ తల్లి' సందర్శన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని గోవిందపురంలో నిర్వహిస్తున్న రెయ్యమ్మ తల్లి జాతర మహోత్సవ వేడుకల్లో వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పేరాడ తిలక్ బుధవారం పాల్గొన్నారు. ఈయనతో పాటు నందిగాం ఎంపిపి నడుపూరి శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కెల్లి కెల్లి జగన్నాయకులు, స్థానిక సర్పంచ్ ఆర్.రామిరెడ్డి, ఆర్.ప్రసాద్‌రెడ్డి, మార్పు నాగభూషణం, నక్కిట్ల నరేష్, పరపటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## పశుగ్రాస సాగుకు ప్రోత్సాహం

**కోటబొమ్మాళి:** ప్రభుత్వం కన్వర్జెన్సీ పద్ధతిలో పశు సంవర్ధకశాఖ, ఉపాధి హామీ ద్వారా బహువార్షిక పశు గ్రాసాల సాగుని ప్రోత్సహిస్తుందని స్థానిక వైద్యాధికారి లిఖినేని కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సాగుకు ఏడాదికి 10 సెంట్ల విస్తీర్ణంకు రూ.6599లు, 20 సెంట్లకు రూ.13197లు, 30 సెంట్లకు రూ.19795లు, 40 సెంట్ల విస్తీర్ణంకు రూ.26394లు, 50 సెంట్ల విస్తీర్ణంకు రూ.32,992లు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

## క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


అభినందిస్తున్న విసి రజని

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఎల్ఎన్‌సిటి యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్ వెస్ట్ అంతర్ వర్సిటీ మహిళా జూడో పోటీలకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం తరువున పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన సిహెచ్.సాయికుమారి (ప్రభుత్వ పురుషుల కళాశాల, శ్రీకాకుళం), వి.కావ్య (ప్రభుత్వ మహిళల కళాశాల, శ్రీకాకుళం) విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు పి.షణ్ముక, శ్రీను కోచ్‌గా వ్యవహరించనున్నారు. క్రీడాకారులకు వర్సిటీ విసి కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ పి.సుజాతలు బుధవారం అభినందనలు తెలిపారు.

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు పిల్లలవలస విద్యార్థి


నగదు అందజేస్తున్న సర్పంచ్ పోలినాయుడు

ప్రజాశక్తి- పొందూరు

చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మాష్మండ్‌లో ఈ నెల 25 నుంచి 29 వరకూ నిర్వహించనున్న 68వ నేషనల్ స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు పిల్లలవలస జెడ్‌పి హెచ్‌ఎస్‌కు చెందిన గురుగుబెల్లి సోమశేఖర్ అనే విద్యార్థి ఎంపికైనట్లు బుధవారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పి.జగదాంబ తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థి సోమశేఖర్‌ను సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, ఉపసర్పంచ్ గురుగుబెల్లి కృష్ణమూర్తిలు అభినందిస్తూ... రూ.1500లు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. సోమశేఖర్‌ను, వ్యాయామ సహాయకులు గురుగుబెల్లి రాజశేఖర్‌లను గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

# సమన్వయంతో పనులు వేగవంతం

ప్రజాశక్తి- పొందూరు


మాట్లాడుతున్న ఎపిఒ శ్రీనివాసరావు

పంచాయతీరాజ్‌శాఖ, ఉపాధి సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో త్వరితగతిన పనులను పూర్తిచేయాలని ఎపిఒ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి మండల ఇంజినీర్ అనంత్‌లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకుతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెపండగ సందర్భంగా మంజూరైన పనులను వేగవంతం చేయాలన్నారు. కూలీలకు వంద రోజులు ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇసి సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## 'ఉన్నతి' సర్వే వేగవంతం


మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

**కోటబొమ్మాళి:** ఉన్నతి సర్వేని వేగవంతం చేయాలని ఎంపిడిఒ కె.ఫణేంద్రకుమార్ ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో వంద రోజులు పనిపూర్తి చేసుకున్న కుటుంబాల్లో విద్యావంతులైన వారికి స్వయం ఉపాధి కల్పన కోసం సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో 80 నుంచి 99 రోజులు ఉన్న ప్రతి కుటుంబానికీ వంద రోజులు చేరుకునే విధంగా పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో మొదట విడతగా రైతులకు మంజూరయ్యే గోశాలను నిర్మాణాలను పూర్తయ్యే విధంగా, అభివృద్ధి పనులు, సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు, సోప్ పిట్‌లు నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టిరాంబాబు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనతోనే విజయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో నిర్దేశించుకున్న లక్ష్యంపై కలిగా పనిచేయడమే విజయానికి మూల సూత్రమని సామాజిక కార్యకర్త ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివశంకర్‌లు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్ఎస్ఎస్ పిఒ ఎల్.మోహనరావు, లైబ్రేరియన్ పి.వై.కమలకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గ్రంథాలయ ఉద్యమ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఎపిఒ పైడిరాజు, లెక్చరర్ హరి తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో కాకినాడ ఆదిత్య యాజమాన్య ప్రతినిధులు

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

### ట్రాఫిక్ సిఐ నాగరాజు


మార్కెట్‌ను పరిశీలిస్తున్న సిఐ నాగరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ మార్కెట్‌లో రోడ్డుకు అడ్డంగా వాహనాలు, తోపుడు బండ్లు ఉంచిన వారిపై చర్యలు తప్పవమని ట్రాఫిక్ సిఐ ఎం.నాగరాజు హెచ్చరించారు. నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన మార్కెట్లో బుధవారం పర్యటించారు. నిబంధనలు అతిక్రమించిన పలు వాహనాలను సీజ్ చేశారు. వాహనదారుల డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్కెట్‌లో పగటి పూట బారీ వాహనాల ప్రవేశం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిన ప్రవేశిస్తే అటువంటి వాహనదారులతో పాటు వ్యాపారులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్, మున్సిపల్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రావు, మల్లేశ్వరరావు, వాసు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

**పాతపట్నం :** ఎస్‌పి ఆదేశాల మేరకు సిఐ వి.రామారావు పాతపట్నం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో బుధవారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి నిర్మూలనలో భాగంగా చెక్‌పోస్ట్‌లో ముమ్మర తనిఖీలు చేసి నిఘా పెంచామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా గంజాయి, మత్తు పదార్థాలు, నాటుసారా, పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తరలించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్ట్ సిబ్బందికి ప్రతిఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిఐ ఆదేశాలు చేశారు.

## విద్యార్థి దశ కీలకం


పుస్తకాలను అందజేస్తున్న ఎస్ఐ చిరంజీవి

**రణస్థలం:** ప్రతిఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలకమని, ఈ దశలో ప్రతిఒక్కరూ ఉన్నత లక్ష్యంతో చదవాలని జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సూచించారు. మండలంలోని కోష్ట పంచాయతీ పల్లెపేట హైస్కూల్ సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం ఎంతో పెట్టుబడి పెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల శ్రమను గుర్తించి వారికి తగిన గౌరవమిస్తూ కష్టపడి చదవాలన్నారు. ఇంట్లో గాని, పరిసరాల్లో కానీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా హెల్ప్ లైన్ నంబరుకు, పోలీస్‌స్టేషన్‌కు మహిళా పోలీసుకి సమాచారం అందజేయాలని సూచించారు. అనంతరం 'సమాజంలో పోలీసుల పాత్ర'పై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## గ్రంథాలయం సందర్శన

**పలాస :** మండలంలోని రామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పలాస ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి సందర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.నర్సింహులు, అధ్యాపకులు పి.వి.రమణ, ఎన్.ఎస్.పట్నాయక్, దీపకుమారి, డి.సాయిరాం, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

# పార్టీలో కష్టపడే వారికే గుర్తింపు

### విజయనగరం ఎంపీ కలిశెట్టి

ప్రజాశక్తి- లావేరు

తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తలకూ పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. లావేరు, గోవిందపురం పంచాయతీ రామునిపాలెం గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ ఆధ్వర్యాన బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు పార్టీకి కష్టపడి పని చేసేవారుకి అండగా ఉండడం సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, చీపురుపల్లి టిడిపి మాజీ ఇన్‌ఛార్జి కె.త్రిమూర్తులురాజు, రణస్థలం మాజీ ఎంపిపి డి.గీతామృత, ఆనందరావు, లంకపల్లి జగన్నదొర, శ్రీను, ఇజ్జు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**సారవకోట:** విస్తృతంగా టిడిపి సభ్యత్వ నమోదు చేస్తున్నామని టిడిపి మండల అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ అన్నారు. మండలంలోని వడ్డినవలస, జగన్నాథపురం, రైవాడ తదితర గ్రామాల్లో బుధవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చల్ల ఆనందరావు, జనా నాగరాజు, మెండ పాపారావు, ఇప్పిలి చంద్రయ్య, ఇప్పిలి సత్యం పాల్గొన్నారు.


లావేరు : సభ్యత్వ నమోదు అందజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

## రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

విజయవాడ జింఖానా మైదానంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న ప్రజా హక్కుల సభ, ర్యాలీని విజయవంతం చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి శ్రీనివాస్ లాడ్జి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలైన సాగునీరు, తాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. జీడికి మద్దతు ధర కల్పించాలన్నారు. జీడి, కొబ్బరి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పలాసలో కిడ్నీ ఆస్పత్రిలో ఆధునీకరణ చేసి సంపూర్ణమైన వైద్య సదుపాయాలు అందివ్వాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేత మద్దిల మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల రైతాంగ నాయకులు రామారావు, ఎఐసిసిటియు నాయకులు కామేశ్వరరావు, కుత్తుం దుష్యంత్, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, సుందరమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎఎన్ఎంలు

## ఇతర పనులను మినహాయించాలి

ప్రజాశక్తి- రణస్థలం

సచివాలయం పరిధిలో పనిచేస్తున్న విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్‌కు పంచాయతీరాజ్‌శాఖ, ఇతర డిపార్ట్‌మెంట్ ఆన్‌లైన్ యాప్ ద్వారా సర్వేలు, ఇతర పనుల నుంచి మినహాయింపు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎఒ ధనుంజయరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు మాట్లాడుతూ విలేజ్ అండ్ వార్డు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ఎఎన్ఎంలను వైద్య ఆరోగ్య శాఖ పనులు చేస్తున్నామని అన్నారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు, సచివాలయం అడ్మిన్లు చెబుతున్నారని, పంచాయతీరాజ్‌శాఖ ద్వారా నిర్వహించాల్సిన రకరకాల ఆన్‌లైన్ యాప్‌లు పూర్తికాలం పనిచేస్తే తప్ప సర్వేలు చేయకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు, హెల్త్ ఎమర్జెన్సీ తదితర ప్రత్యేక పరిస్థితుల్లో సచివాలయం వార్డు అండ్ విలేజ్ హెల్త్ సెక్రటరీస్ గ్రేడ్-3 ఎఎన్ఎంలు అవగాహన కల్పిస్తూ పనిచేయించాలన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న డిసిఒ నాయక్

## క్రీడలతో అనేక ప్రయోజనాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడల్లో రాణించడం వల్ల విద్య, ఉద్యోగాల్లో అనేక రకాలైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవచ్చని జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటరు బాలాజి నాయక్ అన్నారు. ఎచ్చెర్లలోని అంబేద్కర్ గురుకులంలో నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పెద్దపాడు గురుకుల పాఠశాల విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉపాధి అవకాశాల్లో క్రీడాకారుల కోటాను 3 శాతానికి పెంచిందని, అందులో బాలికలు రాణించడం వల్ల కీర్తి, పతకాలు, ఉద్యోగ అవకాశాలు అందుకునేందుకు వీలుందని అన్నారు. క్రీడల వల్ల మంచి ఆరోగ్యం, ఒత్తిడిని తగ్గించుకుని క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న స్వాతి

## రక్షిత పథకం మరమ్మతులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్న చినీటి పథకం మరమ్మతు పనులను ఎమ్మెల్యే గొండుశంకర్ సతీమణి స్వాతి బుధవారం పరిశీలించారు. బొందిలీపురం సమీపాన ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో నగర మంతటా తీగునీటి సరఫరాను నిలుపుదల చేశారు. ప్రధానంగా వంశధార నది నుంచి ఓవర్ హెడ్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేస్తున్న 600 ఎంఎం పైపులైన్ మరమ్మతులకు గురైనట్టు అధికారులు గుర్తించారు. విశాఖ నగరపాలక సంస్థనుంచి సాంకేతిక నిపుణులను రప్పించి మరమ్మతులు పనులు చేస్తున్నారు. ఈ పనులను పరిశీలించిన ఆమె ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఆమెతోపాటు టిడిపి నాయకులు రెడ్డి గిరిజ శంకర్, మట్ట మురళి, సాధు అజయ్ ఉన్నారు.

## గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా భాస్కర్‌గౌడ

ప్రజాశక్తి- మెళియాపుట్టి


భాస్కర్‌గౌడ

మండలంలోని రాజపురానికి చెందిన భాస్కరగౌడ రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో ఎంపిటిసిగా, ఉప సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం మండల టిడిపి అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. పార్టీ అభివృద్ధికి, గౌడ్‌ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సిఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణకు ధన్యవాదాలు తెలిపారు.

## తాడివలస విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కంటయ్య

**పొందూరు:** చిత్తూరు జిల్లా అరగొండలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్‌కు చెందిన వాకముల్లు నిత్యశ్రీ, తొగరాపు భార్గవి, సుందరాపల్లి విజయరాజులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు దవల పెంటయ్యలు బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వీరికి సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఎంపిటిసి సువ్వారి దివ్య, బెలమాం సర్పంచ్ కనుగుల కిషోర్, పిఎంసి చైర్మన్ తమ్మినైన అమ్మాజీ అభినందించారు.

# ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉన్న గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముంగింపు వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ పి.సురేఖ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రంథాలయాన్ని విద్యార్థులు రోజూ సద్వినియోగ పరచుకొని మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాలలో డిజిటల్ లైబ్రరీ వినియోగంలోకి రావడం వల్ల వాటిని వినియోగించు కోవాలన్నారు. ట్రిపుల్ ఐటి చీఫ్ లైబ్రేరియన్ ఎన్.సింహాచలం మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఎంతో విజ్ఞానం దాగి ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా మంచి ప్రవర్తన అలవర్చుకోవచ్చన్నారు. అర్థశాస్త్ర విభాగధిపతి సిహెచ్.రామమూర్తి, కళాశాల గ్రంథాలయాధికారి ఎం.ఇందువదన మాట్లాడుతూ కళాశాలలో పూర్తిస్థాయిలో న్యూస్ పేపర్లు, కాంపిటేటివ్ మ్యాగజైన్స్, రిఫరెన్స్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నగరంలోని జిల్లా కేంద్రం శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవం ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్, చిన్నారావు, ఆరోహి కళాక్షేత్రం సంగీత కళాశాల ఉపాధ్యాయులు పెంకి నాగేశ్వరరావు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకర్ రావు అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా, సిబ్బంది వరలక్ష్మి, కళ్యాణి, ప్రత్యూష, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

**నందిగాం :** స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ చిన్నారావు, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఎర్నగుల హరిబాబు, ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మీకాంతం, గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్‌లు బహుమతులను అందజేశారు.


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ

**కొత్తూరు :** స్థానిక గ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఇఒ నిమ్మల శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వసంత కుమారి, గ్రంథాలయాధికారి టి.ఇందిర, ఉపాధ్యాయయులు రామచంద్రరావు, కె.వినోద్, డి.లక్ష్మి పాల్గొన్నారు.

**పలాస :** గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి కె.వసంతకుమార్ అన్నారు. కాశీబుగ్గలో శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, బి.సత్యం, గ్రంథాలయాధికారి వై.రాంబాబు పాల్గొన్నారు.

**మందస :** స్థానిక శాఖాగ్రంథాలయంలో ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో ఎగులపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంల పంచాయతీ ఇఒ నవీన్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎం.ధర్మారావు, మాస్టారు పాల్గొన్నారు.

**టెక్కలి :** స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జి.మోహనరావు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త త్రివేణి, సహాయకులు అమ్మన్నమ్మ పాల్గొన్నారు.

**లావేరు :** లావేరు శాఖాగ్రంథాలయంలో పట్టణానికి చెందిన మలిపెద్ది దేవేంద్రప్రసాద్ చేసిన మ్యాజిక్ షో విద్యార్థులను ఆట్టుకుంది. హాస్యం, ఆనందం, అద్భుతం ఒకేసారి చేశారు. చైనీస్ రింగ్స్, నీళ్లను పువ్వులుగా మార్చడం, చిత్తుకాగితాలను కరెన్సీ నోట్లుగా మార్చడం, ఖాళీ చేతులు నుంచి కరెన్సీ ప్రొడక్షన్ సృష్టించడం, నోట్లో నుంచి బ్లేడ్లు తీయడం, ఎంప్టీ ఫొటో ఫ్రేమ్ నుంచి శివపార్వతులను సృష్టించారు. తాడును కర్రగా మార్చడం, చిన్న ఖాళీ సంచి నుంచి జాతీయ పతాకం సృష్టించడంతో పాటు సుమారు 30 ఐటమ్స్ చేసి చూపించారు. అలాగే మాట్లాడే బొమ్మ ద్వారా పిల్లలను ఆకట్టుకున్నారు. అనంతరం ఆయనకు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు దుశ్శాలువతో కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తొలిత గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అక్షరాస్యత ర్యాలీ నిర్వహించి చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ తెలుగు పండితులు ఎ.శ్రీనివాసరావు, లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలరాజు, సత్యసాయి స్కూల్ ప్రిన్సిపాల్ కళ్యాణి, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు పాల్గొన్నారు.

**బూర్జ :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపిడిఒ తిరుపతి రావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనంజయరావు, కార్యదర్శి బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంపిఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభవం, ఎస్ఐ పి.రమేష్‌బాబు, నలంద ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లావేరు : మ్యాజిక్ షో నిర్వహిస్తున్న దేవేంద్రప్రసాద్

**ఆమదాలవలస :** స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎ.రాములు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొంగు సత్యనారాయణ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పల్లె తేజ లక్ష్మి, లక్ష్మీనగర్ గేటు మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, టి.వి.రమణమ్మ విశ్రాంత ఉపాధ్యాయులు టి.సూర్యనారాయణ, అంపోలు సూర్యారావు, గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు హెచ్ఎం విశ్వనాథ్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆసి గౌరీశంకర్‌రెడ్డి, గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

**పాతపట్నం** : స్థానిక శాఖాగ్రంథాలయంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వేణుగోపాలరావు, సిఐ వి.రామారావు, గ్రంథాలయాధికారి కాళ్ల రాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంపిడిఒ ఎస్.చిరంజీవిలు, విశ్రాంత ఉపాధ్యాయులు పి.రామరాజు, నేవీ విశ్రాంత అధికారి బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

**పొందూరు:** స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ సిహెచ్.వెంకటేష్ ఆధ్వర్యాన నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం, సభ్యులు గోవిందరావు బహుమతులను అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

## నియోజకవర్గ సమస్యలపై వినతి

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మరకు వెలగంపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించారు. దానికి సిఎం సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

## అప్పారావు నియామకంపై హర్షం

ప్రజాశక్తి- నందిగాం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆమదాలవలస మండలానికి చెందిన బి.అప్పారావు నియామకంపై మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగాన తిరుపతిరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టిడిపి అధికారం చేపట్టి ఉత్తరాంధ్ర నుంచి అప్పారావును డైరెక్టర్‌గా నియమించడంపై సిఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడుల, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈయనతో పాటు బాల మహానాడు మండల నాయకులు కె.వనజనాభ, కెఎన్‌పిఎస్ అధ్యక్షులు బి.ప్రభాకరరావు, దడ్ల ధనంజయరావు ఉన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## ఉత్తమ హెచ్‌ఎంకు సన్మానం

**పొందూరు:** జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా ఎంపికైన తోలాపి జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు వి.సత్యరాజును హిందీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు నిరంజన్, ఆర్.గోవిందరావు, హలీమ్, పద్మజ పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న గౌరీశంకర్

## నైపుణ్యంతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య బోధించాలని డైట్ లెక్చర్ గౌరీ శంకర్, జిసిడిఒ నీరజ అన్నారు. మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌ను బుధవారం జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సాంకేతికతను జోడించి విద్యార్థులను మెరుగుదిద్దాలన్నారు. ఆంగ్లమాధ్యమంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు టిఎల్‌ఎం ఉపయోగించి బోధన కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంపస్ చైర్మన్ సనపల రామకృష్ణ, డిఆర్‌పి గోవిందరావు, సిఆర్‌ఎంటి తులసీదాస్ పాల్గొన్నారు.

## కవిటి ఎస్‌ఐగా రవివర్మ

**కవిటి:** కవిటి ఎస్‌ఐగా రవివర్మ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిఆర్‌పి నుంచి కవిటి ఎస్‌ఐగా ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్ఐ కె.రాము టెక్కలి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది రవివర్మకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## కొత్తూరు ఎస్‌ఐ బదిలీ

**కొత్తూరు :** స్థానిక ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.అహ్మద్ బుధవారం విశాఖపట్నం ఇంటిలిజెన్స్‌కు బదిలీపై అచ్యారు. ఈయన ఏడాదిన్నపాటు ఎస్‌ఐగా పనిచేశారు. ఈయనస్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

# ఒడియా విద్యాభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- కవిటి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో చదువుతున్న ఒడియా విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర పాడి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దళాయి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో కలిసి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ రాష్ట్రంలో 12 వేల మంది ఒడియా విద్యార్థులు చదువుతుండగా, 450 మంది ఒడియా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఒడియా మాధ్యమం కొనసాగించాలని కోరారు. 30 మంది విద్యార్థులున్న ఆరు నుంచి ఎనిమిది తరగతి గల ప్రాథమికోన్నత పాఠశాలకు ఆరుగురు సబ్జెక్టు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. సిబిఎస్‌సి పాఠశాలలో చదువుతున్న ఒడియా విద్యార్థులకు ఆరు నుంచి పదో తరగతి వరకు ఒడియా మధ్యంలో బోధన కొనసాగించాన్నరు. ఎపి మోడల్ స్కూల్లో ప్రథమ భాషగా ఒడియా చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఒమ్మరవెల్లి డైట్ కళాశాలలో ప్రత్యేకంగా ఒడియా అభ్యర్థుల కోసం కొన్ని సీట్లు కేటాయించాలన్నారు. ఒడిశాలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న పేద ఆంధ్ర ఒడియా విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ ఎమ్మెల్యే అశోక్‌తో ఈ విషయాలు పరిశీలించి న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు.


వినతిపత్రం అందజేస్తున్న 'అపోటా' సభ్యులు


మాట్లాడుతున్న ఎడిఎ జగన్మోహనరావు

## రాయితీపై రబీ విత్తనాలు

ప్రజాశక్తి- కవిటి

రబీ పంటకు కావాల్సిన రాగి, మినుము, పెసర విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని కరాపాడు, బెలగాం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వరి పంటను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. రబీ పంటలో యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యాంత్రిక పనిముట్ల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రాయితీపై రైతులకు అందించే ప్రయత్నం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు అమూల్య, రైతులు బుగత వాసుదేవరెడ్డి, కొయ్య దాలయ్య, కోళ్ల రేలంగి తదితరులు పాల్గొన్నారు.

**సోంపేట :** రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు ఎఒ నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని తాళ్లబద్ర, మామిడిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల బీమా వర్తించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, సురాడ చంద్రమోహన్, కృష్ణారావు, భిన్నల జగన్నాథం, ఆర్.కృష్ణారావు, సాయి పాల్గొన్నారు.

## పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కవిటికి చెందిన మహిళకు అండగా నిలిచిన కవిటి గ్రామ అభివద్ధి కమిటీ ఆదర్శంగా నిలిచింది. కవిటి కాలనీలో నివాసం ఉంటున్న పొట్టి ముత్యాలు గుండె, కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. వైద్యం ఖర్చులు పెట్టుకునే స్తోమత లేకపోవడంతో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ఆమెను పరామర్శించారు. తక్షణసాయంగా రూ.పది వేలు అందజేశారు. కార్యక్రమంలో పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, పొల్లాయి లక్ష్మణమూర్తి, భావన రవి, తెప్పల మోహనరావు, జ్ఞానానంద స్వామి పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** మండలంలోని గంగరాజపురానికి చెందిన సంతోష్ బిస్వాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల మాజీ అధ్యక్షులు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం తన సొంత నిధులు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. ఈయనతో పాటు ఒట్టి కోళ్ల చక్రి, వీరన్న, లావుడు ఉన్నారు.


మెళియాపుట్టి : నగదు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న సిఐ రామారావు

## సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పాతపట్నం

సైబర్ నేరాలపై ప్రమత్తంగా ఉంటూ అవగాహన కలిగి ఉంచాలని సిఐ వి.రామారావు అన్నారు. స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాలు జరిగితే 1930 నంబరుకు తక్షణమే ఫోన్ చేస్తే... రికవరీ చేస్తామని వివరించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, లేనిచో అనవసరంగా కేసులు ఇరుక్కుని భవిషత్ పాడు చేసుకుంటారని బోధించారు. వాటి వినియోగం వల్ల అనారోగ్యానికి పాలై జీవితాన్ని నాశనం చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ఆంజనేయులు, అధ్యాపకులు బి.వి.రమణ పాల్గొన్నారు.

# ఆయుర్వేద వైద్యంపై అవగాహన

**బూర్జ :** ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలి వ్యాధులు నమం చేయవచ్చునని ఆయుష్ వైద్య అధికారి కె.మంగమ్మ అన్నారు. స్థానిక కార్మిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఆశావర్కర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆయుర్వేదం హోమియో వైద్యం అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాచీనమైన ఆయుర్వేదం చేరువ చేస్తుందన్నారు. మందులను కూడా అందజేస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాజశేఖర్, పావని, సిహెచ్‌ఒ అప్పలస్వామి పాల్గొన్నారు.

**పాతపట్నం:** మండలంలోని తెంబూరులో యోమియోపతి డాక్టర్ ఎస్.ఉమాగైరీ ఆశా కార్యకర్తలకు హోమియో వైద్యం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సదాశివరావు, డిస్పెన్సరీ ఫార్మసిస్టు దివ్య, తెంబూరు యోగా ఇన్స్ట్రక్టర్ పాలిన మహేష్ పాల్గొన్నారు.


బూర్జ : అవగాహన కల్పిస్తున్న హోమియో వైద్యాధికారి మంగమ్మ

## తిలక్ పరామర్శ

**కోటబొమ్మాళి:** మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను వైసిపి టెక్కలి నియోజవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ బుధవారం పరామర్శించారు. మండలంలోని చిన్నసానకు వైసిపి నాయకులు మేడిబోయిన నారాయణరావు, అదే గ్రామానికి చెందిన కార్యకర్త బలగ తులసయ్య తండ్రి బలగ అడివయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన బోనాల కుర్మారావు గత కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో ఆయను పరామర్శించారు. ఈయనతో పాటు జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరమణ, అన్నెపు రామారావు, గంగారాం సర్పంచ్ పేడాడ వెంకటరావు, స్థానిక సర్పంచ్ బోనేల ఎల్లయ్య, బగ్గు వేణు, సింగార నారాయణరావు, రొక్కం శ్రీధర్ ఉన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తానని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పూండిలో ఆయన స్వగృహంలో మండలంలోని అగ్నికుల క్షత్రియ ఉపాధ్యాయులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేస్తూ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సింహాచలం, కె.నాగేశ్వరరావు, జి.తులసీ దాస్, శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, చింత ఉమారావు, జి.శరత్, డి.తులసీరావు, అప్పారావు, లోకేష్ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

## గుంతలు లేని రోడ్డులే లక్ష్యం

**నౌపడ:** గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని నౌపడ టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి అన్నారు. రూ.5 లక్షల నిధులతో నౌపడా-వెంకటపురం రోడ్డు మరమ్మతు పనులకు బుధవారం శంకుస్థాపన చేసి అనంతరం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌అండ్‌బి జెఇ జగదీష్, వాడరేవు కృష్ణారావు, మహంతి రాజు, కర్రి బాలకృష్ణ, సిహెచ్.బాబ్జి, నీలాపు దాలయ్య, అప్పలరాజు, తేజ, గిన్ని నరసింహమూర్తి పాల్గొన్నారు.


నేత్రాలను పరీక్షిస్తున్న కావ్య

## వైద్య శిబిరానికి స్పందన

**మందస:** జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య సహాయకులు అక్కురాడ కావ్య 96 మంది నేత్రాలను పరీక్షించి 48 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి టి.రామారావు, సత్యసాయి బాబా సేవా సమితి కన్వీనర్ వూన్న ఈశ్వరరావు, వడ్డి అప్పారావు జోనల్ ఇన్‌ఛార్జి భైరాగి మాస్టారు పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ

**ఇచ్ఛాపురం:** విద్యా సామగ్రితో విద్యాభివృద్ధి సాధ్యమని కాంప్లెక్స్ చైర్మన్ ఉషారాణి తెలిపారు. మండలంలోని లొద్దపుట్టిలో విద్యా సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులంతా వారివారి విధివిధానాలను విద్యాభివృద్ధి నియమాలను తెలియజేసి విద్యార్థికి ఉపయోగపడే విధంగా పాఠ్య ప్రణాళిక సాగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వెంకటరావు, రవీంద్ర, రమణ, నాగేశ్వరరావు, శ్యామ్, పద్మిని, మాధవి, సరోజని, సిఆర్‌పి తులసీరావు పాల్గొన్నారు.